
సాక్షి
ఒడిశా

మంగళవారం । 3 । డిసెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.7,42,806లు, బంగారం 1 గ్రాము 500 మిల్లీగ్రాములు వెండి 46 గ్రాముల 220 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



గంజాయి ధ్వంసం

గంజాయి క్షేత్రాలను పోలీసులు ధ్వంసం చేశారు. వీటి విలువ కోట్లలో ఉంటుంది. - 8లో



ప్రత్యేక శిబిరానికి స్పందన

పర్లాకిమిడిలో ప్రత్యేక శిబిరానికి స్పందన లభించింది. దివ్యాంగులకు సర్టిఫికెట్లు అందజేశారు. - 8లో

నృత్యోత్సవ వైభవం

ప్రపంచ ప్రఖ్యాత కోణార్క్ నృత్యోత్సవం ప్రారంభమైంది. ఆదివారం సాయంత్రం ముఖ్యమంత్రి మోహన్ మాఝి ఉత్సవాలను ప్రారంభించారు. కోణార్క్ చంద్రభాగ తీరంలో ఏర్పాటు చేసిన నృత్యోత్సవ వేదిక శాస్త్రీయ నృత్య, సంగీతంతో మారుమోగింది. ఐదు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో దేశం నలు మూలల నుంచి విశేష సంఖ్యలో ప్రేక్షకులు ఒడిస్సీ నృత్యం, భరతనాట్యం, కూచిపూడి వంటి శాస్త్రీయ నృత్యాలను ఆస్వాదిస్తారు. కోణార్క్ నృత్యోత్సవంతో పాటు 14వ అంతర్జాతీయ సైకత కళా ప్రదర్శనను ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రారంభించారు. చంద్రభాగ సాగర తీరంలో నిర్వహించిన ఈ ప్రదర్శనలో 8 దేశాల నుంచి 130 మంది కళాకారులు పాల్గొన్నారు. తొలి రోజున సనాతన అస్మిత, మహిళా సాధికారతతో పాటు సైకత శిల్పాలు ప్రదర్శించారు. రాష్ట్ర పర్యాటక శాఖ బ్రాండ్ అంబాసిడర్ సుదర్శన్ పట్నాయక్ ఈ ప్రదర్శనకు సారథ్యం వహిస్తున్నారు. తొలి సంధ్య ప్రదర్శనలో స్థానిక ఉత్కళ సంగీత మహా విద్యాలయం బృందం ఒడిస్సీ, మాలతీ శ్యాం, న్యూ ఢిల్లీ బృందం కథక్ శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ప్రేక్షకుల్ని అలరించాయి.

భువనేశ్వర్



కళాకారుల నృత్య విన్యాసం









పరిశీలిస్తున్న సీఎం మోహన్ మాఝీ



న్యూస్‌రీల్

పునరావాసం కల్పించండి ప్లీజ్



మున్సిపాలిటీ అధికారులను కలిసిన బాధిత మహిళా వ్యాపారులు

జయపురం: తమకు పునరావాసం కల్పించాలని జయపురంలో రోడ్డు సైడ్‌లలో కాయకూరలు అమ్ముకునే గ్రామీణ మహిళలు మున్సిపాలిటీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. తాము ముప్పై ఏళ్లుగా ఇక్కడే వ్యాపారాలు చేస్తున్నామని, ఇటీవల ఆక్రమణలు తొలగించడంతో తాము ఉపాధి కోల్పోయామని తెలిపారు. ఎంజీ రోడ్డు తర్వాత మెయిన్ రోడ్డు వెడల్పు చేస్తారని అంటున్నారని, దైనిక బజారులో సిమ్మెంట్ దిమ్మలు ఏర్పాటు చేసి వాటిపై వ్యాపారం చేసేందుకు తమకు అనుమతించాలని వారు కోరారు. అలా తమకు పునరావాసం కల్పిస్తే రోడ్డు పక్కల కాయకూరలు అమ్ముకొనే సమస్య ఉత్పన్నం కాదని పాతి మాలి, రొయిమతి మాలి, సుకలదేయి పాయిక, చంపా మాలి తదితరులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

● భార్యకు గాయాలు



లిటిలి రాజ మృతదేహం

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో ఉన్న వంశధార బ్రిడ్జి వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్య తీవ్ర గాయాలకు గురయ్యారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం .. గుణుపూర్ సమీపంలోని చిన్న విక్రమపూర్ గ్రామానికి చెందిన లిటిలి రాజ (30) తన భార్య సరితలు బైకుపై వెళుతున్న సమయంలో వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో దంపతులిద్దరూ కింద పడిపోయారు. తలకు బలమైన గాయం కావడంతో లిటిలి అక్కడిక్కడే మృతి చెందగా అతని భార్య సరిత గాయాలకు గురయ్యారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. గాయపడిన సరతను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పట్టుకునేందుకు పోలీసులు గాలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

పట్టణ విద్యార్థుల గ్రామ సందర్శన



గ్రామ సందర్శనలో విద్యార్థులు

జయపురం: పట్టణ విద్యార్థులకు పల్లెల వాతావరణం, ప్రజల జీవన శైలి ఆచార వ్యవహారాలపై అవగాహన కలిగించే కార్యక్రమాన్ని చేపట్టారు జయపురం అరవిందనగర్ సరస్వతీ శిశు మందిర పాఠశాల నిర్వాహకులు. ఆ పాఠశాల విద్యార్థులకు ఆదివారం జయపురం సమితిలో రెండు గ్రామాలకు తీసుకెళ్లి గ్రామాల వాతావరణాన్ని చూపించారు. గ్రామాలలో పర్యావరణం, గ్రామ ప్రజల జీవన విధానంపై విద్యార్థులలో అవగాహన కలగించటమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పాఠశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ రమణీరంజన్ దాస్ సోమవారం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మొదటిసారిగా తొమ్మిదో తరగతి విద్యార్థులకు గొడాపాదర్ గ్రామ పంచాయతీ దుబులి, ఎక్టాగుడ గ్రామాలకు తీసుకెళ్లి పంట పొలాలు, పంటలు పండించే విధానం, సాగునీరు, వరిచేను కోతలు, ధాన్యం చేను కుప్పలు వేసే కల్లాలు చూపించామన్నారు. గ్రామాలలో మట్టిగోడలతో కట్టిన ఇల్లు, వరిగడ్డితో నేసిన ఇంటి కప్పులు, కట్టెలతో మహిళలు వంటలు చేసే విధానం, గ్రామీణ పిల్లల జీవన విధానంపై అవగాహన కలిగించినట్టు ప్రధాన ఆచార్యులు రమణీ రంజన్ దాస్ వెల్లడించారు. గ్రామాలు ఎలా ఉంటాయో తెలియని విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని ఎంజాయ్ చేసి గ్రామీణ వాతావరణాన్ని ఆస్వాదించారన్నారు.

కుసుమంచి పద్యం..
తెలుగు తల్లికి నైవేద్యం

● రచయిత భళ్లమూడి నాగరాజు



కుసుమంచి పలుకు పుస్తకాన్ని పరిచయం చేస్తున్న నాగరాజు, వేదికపై టి.వి.ఎస్.ఆర్.అప్పారావు

రాయగడ: విజయనగరం పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత్రి కుసుమంచి శ్రీదేవి రచించిన కుసుమంచి పలుకు శతకము తెలుగు తల్లికి నైవేద్యం వంటిదని సీనియర్ పాత్రికేయుడు, రచయిత భళ్లమూడి నాగరాజు అన్నారు. స్థానిక రాజ్‌భవన్ సమావేశం హాల్‌లో ఆదివారం సాయంత్రం రాయగడ రచయితల సంఘం (రారసం) వారు నిర్వహించిన సాహితీ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎంఎస్సీలో పట్టభద్రులైన కుసుమంచి శ్రీదేవి తెలుగు భాషపై ఉన్న అభిమానంతో తెలుగులో ఎంఏ పూర్తి చేసి ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఆటవెలదిలో రచించిన పద్యాల మాధుర్యాన్ని నాగరాజు వివరించారు. తెలుగు భాషలో ఉన్న పద్య సాహిత్యం సంపదని పిల్లలకు అందివ్వాలన్నారు. ప్రతీ రచయిత కనీసం ఒకటైనా పద్యం రచించాలని సూచించారు. సంస్థ అధ్యక్షులు టి.వి.ఎస్.ఆర్.అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో డాక్టర్ పతివాడ తులసీదాస్ శ్రీశ్రీ సాహిత్యాన్ని నవ, యువకవులు చదవాలని అన్నారు. భళ్లమూడి వెంకట నాగేశ్వరరావు పోస్టుమెన్ అనే స్వీయ కథను వినిపించి అనేక ఆధ్యాత్మిక విషయాలు తెలియజేశారు. చిన్నారి చక్రధర్, పీఎంజీ శంకరరావు, ఎల్.శివకేశవరావు, రాహమోహన్‌రావు, సత్యనారాయణరాజు తదితరులు పాటలు పాడారు. సహ కార్యదర్శి మామిడి గణపతిరావు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌సెల్‌లో సమస్యల ఏకరువు



కలెక్టరేట్ గ్రీవెన్స్‌సెల్‌లో ఎస్పీ పండా, కలెక్టర్ బిజయకుమార్ దాస్

పర్లాకిమిడి: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం పరిపాలన, గ్రీవెన్స్‌సెల్‌కు అధికసంఖ్యలో రాణిపేట, సిద్ధమణుగు, కెరండి, కత్తలకవిటి పంచాయతీ పాటు పర్లాకిమిడి మున్సిపల్ పరిధిలోని ప్రజలు విచ్చేశారు. కలెక్టర్ బిజయకుమార్ దాస్, ఎస్పీ జితేంద్ర నాథ్ పండా, డీఆర్‌డీఏ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి గుణనిధి నాయక్‌లు హాజరయ్యారు. మొత్తంగా 70 వినతులు కలెక్టర్‌కు అందగా, వాటిలో 6 అభియోగాలు అక్కడికక్కడే పరిష్కరించారు. మిగతా 55 వ్యక్తిగత సమస్యలు కాగా, గ్రామసమస్యలు 15 ఉన్నాయి. వాటిని సంబంధిత అధికారులు తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. ఈ గ్రీవెన్స్‌కు నోడల్ అధికారి లిపినా దాస్, ఐటీడీఏ పీఓ అంశుమాన్ మహాపాత్రో, డీఎస్ఎస్ఓ సంతోష్ కుమార్ నాయక్ తదితర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

రూ. 3.5కోట్ల విలువైన గంజాయి పంట ధ్వంసం



గంజాయి మొక్కలను కుప్పలుగా పెడుతున్న పోలీసులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి మఠపడ, రామగిరి పోలీసు పంటి పరిధి బాఘఖద్ర, ఖెండియజొడి, డెంగపకస్ ప్రాంతాల్లో చట్ట వ్యతిరేకంగా పండిస్తున్న గంజాయి పంట పొలాలపై దాడులు జరిపినట్లు బొయిపరిగుడ పోలీసు అధికారి దీపాంజలి ప్రధాన్ సోమవారం తెలిపారు. ఆపరేషన్ గ్రీన్ క్లీన్ అభిజాన్‌లో నిర్వహించిన దాడుల్లో 31 ఎకరాలలో పండించిన గంజాయి పంటను గుర్తించి వాటిని ఒక చోట చేర్చి తగులబెట్టినట్లు ఆమె వెల్లడించారు. 31 ఎకరాల్లో బాగా పండిన 31,500 గంజాయి మొక్కలను పోలీసు సిబ్బంది తగలబెట్టారు. ఈ గంజాయి విలువ రూ.3 కోట్ల 50 లక్షలకు పైనే ఉంటుందని పోలీసు అధికారి వెల్లడించారు. బొయిపరిగుడ సమితి బాఘఖద్ర, ఖెండియజొడి, డెంగపకస్ ప్రాంతాల్లో గంజాయి విస్తృతంగా పండిస్తున్నట్లు సమాచారం పోలీసులకు అందిందని ఆమె వెల్లడించారు



పోలీసు సిబ్బందితో గంజాయి పంటలను పరిశీలిస్తున్న అధికారులు



గంజాయి మొక్కలను తగలబెడుతున్న సిబ్బంది

అంగన్‌వాడీల ఆగ్రహం



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడ్ సమితి నువాగాం పంచాయతీ డొంగరిగుడ గ్రామం అంగన్‌వాడీ వర్కర్ కృష్ణ ప్రియ మహంతిపై దాడి చేయడంపై తోటి అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ వర్కర్ల సంఘం అధ్యక్షురాలు రేణుబాల శత్రుశల్య, రుకుమణి బెహరాల నేతృత్వంలో సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. దాడి చేసిన నాయిక్ సర్పంచ్ సారి హరిజన్, ఆమె భర్తపై సామదాస్ హరిజన్‌లపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు కొట్‌పాడ్ బీడీఓ, సీడీపీఓ, పోలీసు అధికారులను కలసి మెమొరాండం సమర్పించారు. నాయిక్ సర్పంచ్, ఆమె భర్తపై శుక్రవారమే ఫిర్యాదు చేసినా ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. వెంటనే నాయిక్ సర్పంచ్ సారి హరిజన్‌ను పదవి నుంచి సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆందోళనలో గీతాంజలి బెహర, శాంతిలత మహారాణ,నీలమణి సాహు,బినోదిని నాయిక్,మీణా మహంతి,రంజిత నాయిక్‌తో పాటు అనేక మంది అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు. ఈ సంఘటనపై కొట్‌పాడ్ పోలీసు అధికారి పరమానంద సునాని ప్రశ్నించగా నాయిక్ సర్పంచ్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని వెల్లడించారు.



పోలీసు స్టేషన్‌లో వినతి సమర్పిస్తున్న అంగన్‌వాడీ సంఘ నేతలు

న్యాయవాదుల నిరసన

● న్యాయవాదిపై యాసిడ్ దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్

● జిల్లా ఎస్పీకి బార్ అసోసియేషన్ ప్రతినిధుల వినతి



జిల్లా కోర్టు ఆవరణలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

పర్లాకిమిడి: న్యాయవాది పత్తి రామారావుపై యాసిడ్ దాడి కేసులో పోలీసులు ఇప్పటివరకూ నిందితుల్ని పట్టుకోలేక పోయారని నిరసిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా కోర్టు వద్ద నుంచి పర్లాకిమిడి బార్ అసోసియేషన్ పట్టణంలో ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా పోలీసులకు వ్యతిరేకంగా అడ్వకేట్లు కోర్టు విధులను బహిష్కరించి, నినాదాలు చేస్తూ కలెక్టరేట్, మోడల్ పోలీసుస్టేషన్, పెద్ద మార్కెట్, కొత్త బస్టాండు మీదుగా రాణిపేటలో ఉన్న జిల్లా ఎస్పీ కార్యాలయం వరకూ మోటారు సైకిల్ ర్యాలీ జరిపారు. అనంతరం జిల్లా ఎస్పీ జితేంద్రనాథ్ పండాకు గౌరవ రాష్ట్రపతి, ఒడిశా గవర్నరు రఘువరదాస్, సీఎం మోహన్ చరణ్ మాఝి, రాష్ట్ర న్యాయశాఖ మంత్రి హరిచందన్‌కు యడ్రస్ చేస్తూ రాసిన వినతిని బార్ అసోసియేషన్ అధ్యక్షులు స్వరూప్ కుమార్ పాలో సమర్పించారు. న్యాయవాదులకు రక్షణ కల్పిస్తూ చట్టం అమలు వెంటనే జరపాలని బార్ అసోసియేషన్ డిమాండు చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంకు ర్యాలీగా వెళ్లి జిల్లా పాలనాధికారి బిజయకుమార్ దాస్‌కు వినతిని అందజేశారు. ర్యాలీలో బార్ అసోసియేషన్ కార్యదర్శి రామకృష్ణ నాయక్, జాయింట్ సెక్రటరీ నీలమాధవ్ అధికారి, ఉపాధ్యక్షులు శిశిర్ కుమార్ జెన్నా, సీనియర్ న్యాయవాదులు హీరాచంద్, ముల్లి గోపాలరావు, ప్రభుత్వ పీపీ వి.ఎస్.ఎన్.రాజు, పృధ్వీరాజ్, రౌతు ఉదయ చంద్రరావు, కై లాష్ చంద్ర గౌడో, శైలాడ శ్రీరాములు, రామనాథ్, పంటల ప్రసాదరావు పాల్గొన్నారు.



జిల్లా కోర్టు నుంచి ర్యాలీగా బయలుదేరుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు



జిల్లా ఎస్పీ జితేంద్ర పండాకు వినతిని అందజేస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షులు స్వరూప్ కుమార్ పాలో తదితరులు



హై స్కూల్ జంక్షన్ వద్ద మోటారు సైకిళ్ల ర్యాలీలో న్యాయవాదులు

క్లుప్తంగా

మహిళలకు వంటల పోటీలు



తయారు చేసిన వంటలతో విజేతలు

రాయగడ: రాయగడ పట్టణంలోని అశోక్ కల్యాణ మండపంలో హిందుస్థాన్ పెట్రోలియమ్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ఆధ్వర్యంలో సంప్రదాయ వంటల పోటీలు ఆదివారం సాయంత్రం ఉత్సాహంగా జరిగాయి. 15 మంది మహిళలు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. నిబంధనలు మేరకు విజేతలకు బహుమతులను అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా రీతారాణి మిశ్రా, సత్యసాయి వ్యవహరించారు. కరిస్మా మిశ్రో ప్రథమ బహుమతిని గెలుచుకోగా లలిత దొర ద్వితీయ, నమితా పాఢిలు తృతీయ స్థానాల్లో నిలిచారు.

సౌత్ జోన్ ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, కళాశాల అధ్యాపకులు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలల్లో చదువుతున్న ఐదుగురు విద్యార్థులు సౌత్‌జోన్ స్థాయి ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. కె.నితిన్, వసంత్, భరత్, జస్వంత్‌తో పాటు మరో విద్యార్థి కళాశాల నుంచి ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ పి.లత తెలిపారు. ఈనెల 12వ తేదీ నుంచి 28వ తేదీ వరకూ కేరళ రాష్ట్రం కాలికట్‌లో యూనివర్సిటీ ఆఫ్ కాలికట్ వారు సౌత్ జోన్ స్థాయి ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. తమిళనాడు, పాండిచ్చేరి, కేరళ, తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొనున్నట్లు వెల్లడించారు. తమ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు పోటీలకు ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. వీరికి ఉత్తమ శిక్షణ ఇవ్వాలని ఫిజికల్ డైరెక్టర్ భోగేశ్వరరావుకు సూచించారు.

అట్రాసిటీ కేసులో రెండేళ్ల జైలు శిక్ష

పాతపట్నం: భౌతిక దాడి, అట్రాసిటీ కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ 4వ అదనపు జిల్లా కోర్టు జడ్జి ఎం.ఫణికుమార్ తీర్పు ఇచ్చారని పాతపట్నం ఎస్‌ఐ బి.లావణ్య సోమవారం మీడియాకు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. పాతపట్నం మండల కేంద్రంలోని యశోదనగర్‌కు చెందిన పి.చిన్నమ్మడు తన కుటుంబ సభ్యులతో కలిసి సొంత ఇంట్లో రెండో అంతస్తులో నివాసం ఉంటుంది. పక్క ఇంట్లో తూర్పు వైపు జి.అమరావతి కుటుంబ సభ్యులతో ఉంటోంది. ఈ మేరకు 2020 ఫిబ్రవరి 24వ తేదీన చిన్నమ్మడు, అమరావతిలకు చెందిన ఇంటి డాబా గోడపై పూల కుండి నీరు వెళ్లిన సంఘటనలో, తగదా రావడంతో కులం పేరుతో తిట్టడంతో పాటు జగ్గుతో కొట్టడం జరిగింది. దీంతో చిన్నమ్మడు పోలీసులకు అమరావతి భర్తపై ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్‌ఐ టి.రాజేష్ కేసు నమోదు చేయగా, ట్రాఫిక్ డీఎస్పీ ప్రసాద్‌రావు దర్యాప్తు చేయడం జరిగిందన్నారు. ఈ మేరకు సోమవారం ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టులో వాదోపవాదాలు అనంతరం ముద్దాయికి రెండు సంవత్సర జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించారు. ఫైన్ కట్టని పక్షంలో మరో మూడు నెలల జైలు శిక్ష ఉంటుందని తీర్పును ఇవ్వడం జరిగిందన్నారు.

ప్రత్యేక శిబిరానికి విశేష స్పందన



దివ్యాంగుల శిబిరానికి హాజరైన అతిథులు



పింఛన్, భృతి కోసం వెళ్తున్న దివ్యాంగుడు

పర్లాకిమిడి: స్థానిక టౌన్ హాల్‌లో దివ్యాంగుల కోసం సామర్థ్య ప్రత్యేక శిబిరాన్ని మున్సిపల్ కౌన్సిలర్ బాలకృష్ణ పాత్రో, డీఎస్ఎస్‌ఓ ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది సోమవారం ప్రారంభించారు. ఈ శిబిరంలో అర్హులైన దివ్యాంగులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు, సర్టిఫికెట్లు మంజూరు చేశారు. డీఆర్‌ఐ రుణాలు, వివాహ ప్రోత్సాహకం, నెలసరి భృతి, బస్సుల్లో ఉచిత ప్రయాణం, వాణిశ్రీ స్కాలర్‌షిప్పులు, రేషన్ కార్డులు మంజూరు చేశారు. ఈ శిబిరంలో డీఆర్‌ఐ రుణాల కోసం 18 మంది,



మోహనా బ్లాక్ నుంచి వచ్చిన దివ్యాంగుని తల్లిదండ్రులు

దివ్యాంగుల పింఛన్‌కు 49 మంది, రేషన్ కార్డులకు ఇద్దరు పేర్లు రిజిస్టర్ చేయించుకున్నారు. దివ్యాంగులకు వైద్యుడు సంతను పాడీ పరీక్షలు చేశారు. మున్సిపల్ స్వస్థ్య కర్మి, స్వస్థ్య సాథీలు సహకరించారు.



వివాహ ప్రోత్సాహకం, డీఆర్‌ఐ రుణాల కోసం రిజిస్ట్రేషన్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

రాష్ట్రంలో వైద్యులు, పోలీసు పోస్టులు ఖాళీ

భువనేశ్వర్: రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో వైద్యులు, పోలీసు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్ మాట్లాడుతూ 5,014 వైద్యుల పదవులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. 13,373 పోలీసు ఉద్యోగాలు భర్తీ కాక ఖాళీగా ఉన్నాయని హోం శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. శాసన సభలో ఆరోగ్య శాఖ మంత్రి ముఖేష్ మహాలింగ్ ప్రవేశపెట్టిన వివరాల ప్రకారం విభాగంలో వైద్య నిపుణుల కొరత నెలకొని ఉందన్నారు. విపక్ష బిజూ జనతా దళ్ ఎమ్మెల్యే ప్రశాంత్ బెహెరా అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, స్పెషలిస్టుల కోసం ఉద్దేశించిన 1,114 పోస్టులతో సహా 5,014 వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆరోగ్య మంత్రి మహాలింగ్ సభకు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యుల కొరత పరిస్థితి అత్యంత దయనీయంగా ఉన్నట్లు స్పష్టమైంది. మంత్రి సభలో ప్రవేశపెట్టిన సమాచారం ప్రకారం, 30 జిల్లాల్లో 375 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు వైద్యులు లేకుండా చెలామణీ అవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యుల కొరత పరిస్థితి చాలా తీవ్రంగా ఉంది. గంజాం జిల్లా అత్యంత తీవ్రమైన కొరతను ఎదుర్కొంటోంది. ఈ జిల్లాలో 450, మయూర్‌భంజ్‌లో 309 ఖాళీలు ఉన్నాయి. ఈ రెండు జిల్లాలు వైద్య నిపుణుల కొరతను ఎదుర్కొంటున్నాయి. ఈ రెండు జిల్లాల్లో 87 చొప్పున స్పెషలిస్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు మంత్రి తెలిపారు. ఖుర్దా జిల్లాలో 12, కటక్‌లో 281 భర్తీ కాని పోస్టులతో వైద్యుల కొరత కొనసాగుతోంది. రాష్ట్రంలో ప్రజారోగ్య సేవలతో చట్టం అమలు, నేర నియంత్రణ రంగాల్లో అత్యవసర సేవల్లో ఖాళీల అంశంపై సభ్యులు శాసన సభలో ప్రస్తావించారు. పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులు వంటి ముఖ్యమైన సమస్యపై కాంగ్రెస్ ఎమ్మెల్యే పబిత్రా సౌంటా అడిగిన ప్రశ్నకు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ సమాధానమిస్తూ, పోలీసు శాఖలో 13,373 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అగ్ని మాపక శాఖలో 481 పోస్టులు ఖాళీగా ఉన్నాయని సభకు తెలిపారు. రాష్ట్రంలో 2,416 హోం గార్డు పోస్టులు ఖాళీగా ఉండగా, జైళ్లలో 862 పోస్టులు భర్తీ కాకుండా ఖాళీగా ఉన్నాయని ముఖ్యమంత్రి వివరించారు.

16 నుంచి ధర్నా



సమావేశంలో పాల్గొన్న కార్మికులు

జయపురం: గగణాపూర్‌లో గల సేవా పేపరు మిల్లును పునరుద్ధరించి, కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ 16వ తేదీ నుంచి అసెంబ్లీ ముందు ధార్నా నిర్వహించాలని కార్మికులు నిర్ణయించారు. సోమవారం స్థానిక కార్మిక భవనంలో పేపరు మిల్లు కార్మికుల సమావేశం ఏర్పాటు చేసి ఈ నిర్ణయం తీసుకున్నారు. కార్మిక నేత ప్రమోద్ మహంతి మాట్లాడుతూ.. మిల్లు జూలై నుంచి మూతపడి ఉందని, నేడు మిల్లులో యంత్రాలను పాలిథిన్ పేపర్లతో కట్టి వేస్తున్నారని, అందువలన రెండు, మూడు నెలలో మిల్లు మూసివేస్తారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. విశ్రాంత కార్మికుల సమస్యలు నేటికీ పరిష్కరించలేదని, గత 6 నెలలుగా మిల్లులో పనిచేసే కార్మికులకు వేతనాలు చెల్లించలేదని వెల్లడించారు. నేడు మిల్లులో నెలకొన్న పరిస్థితులు కార్మికులలో ఆందోళన కల్పిస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టి మిల్లు నడిపించేందుకు, కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆందోళన సమయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని, ముఖ్యమంత్రిని, పరిశ్రమల మంత్రిని, కార్మిక మంత్రులను, ఏఐటీయూసీ రాష్ట్ర నేతలను కలిసి చర్చిస్తారని వెల్లడించారు. కార్మిక నేతలు సుభాష్ బెహర, సరోజ్ పండ, ప్రహ్లాద్ మల్లిక్, కె.సత్యనారాయణ, అలేఖ్ పాత్రో, తదితరులు ప్రసంగించారు.

ఆస్పత్రికి శరీరం దానం



పాపారావు మృతదేహాన్ని రిమ్స్‌కు అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు



కోళ్ల పాపారావు (ఫైల్)

టెక్కలి: తన మరణానంతరం మృతదేహాన్ని రిమ్స్ మెడికల్ కళాశాలకు అప్పగించాలని నమోదు చేసుకోవడంతో ప్రగతి శీల కార్మిక సంఘం సభ్యుడు కోళ్ల పాపారావు మృతదేహాన్ని కుటుంబ సభ్యులు ఆస్పత్రికి అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. గతంలో సావిత్రీబాయి పూలే ట్రస్టు ఆధ్వర్యంలో తన శరీరాన్ని దానం చేయడానికి పాపారావు నమోదు చేసుకున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన కుటుంబ సభ్యులు కోళ్ల లోకేష్ బాబు, కోళ్ల కుమార స్వామి, తియ్యాల ఈశ్వరరావు తదితరులు ప్రజా సంఘాల నాయకుల సహకారంతో శ్రీకాకుళం రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీఆర్ వెంకటాచలం, డాక్టర్ కె.వి.రామ్‌ప్రసాద్, అనాటమి డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ ఎం.హేమా రాధికలకు మృతదేహాన్ని అప్పగించారు. పాపారావు గతంలో పీపుల్స్ వార్ పార్టీలో పనిచేశారు. ఆరోగ్యం సక్రమంగా లేకపోవడంతో జన జీవన స్రవంతిలో కలిసిపోయారు. ఆ తర్వాత కాకరాపల్లి, సోంపేట థర్మల్ పోరాటంలో పాల్గొన్నారు. నౌపడ రైల్వే ఉద్యమంలో తనదైన పాత్ర పోషించారు. ఉప్పు కార్మికుల సమస్యల కోసం ఉద్యమ బాట పట్టారు. రైతులు, కార్మికుల పక్షాన నిలబడి నిరంతరం పోరాటాలు చేసేవారు. ఈయన మృతిపై ప్రగతి శీల కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పుచ్చ దుర్యోధన, ధర్మారావు, కారి పురుషోత్తం, కేఎన్‌పీఎస్ నాయకులు మిష్క కృష్ణయ్య, బి.ప్రభాకరరావు, డీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు కోత ధర్మారావు, ప్రజా సంఘాల నాయకులు ధనలక్ష్మి, గంగయ్య, లోకనాథం తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

గజపతి ఉత్సవాలపై సమీక్ష



సమావేశంలో సాంస్కృతిక కమిటీ ప్రతినిధులు

పర్లాకిమిడి: స్థానిక గజపతి స్టేడియంలో ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకూ జరుగనున్న గజపతి ఉత్సవాలపై అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా కలెక్టరేట్‌లో సాంస్కృతిక కమిటీ సభ్యులు జిల్లా కల్చరల్ అధికారి అర్చనా మంగరాజ్‌తో సోమవారం భేటీ అయ్యారు. సాంస్కృతిక కమిటీ అధ్యక్షులుగా గురు రఘునాథ పాత్రో వ్యవహరించారు. రాష్ట్రంలోని కోరాపుట్, మలకనగిరి, గంజాం, సంబల్‌పూర్, పూరీ, మయూర్‌భంజ్, ఖుర్దా, బరఘడ్, కళాహాండి, నవరంగ్‌పూర్‌ల నుంచి విభిన్న కళాకారులను ఉత్సవాలకు ఆహ్వానించనున్నట్టు కమిటీ అధ్యక్షులు పాత్రో తెలిపారు. అలాగే పశ్చిమబెంగాల్, జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కూడా కళాకారులను ఆహ్వానిస్తామన్నారు. ఐదు రోజులు జరిగే గజపతి ఉత్సవాల్లో ప్రేక్షకులను రంజింప జేసేలా కళా ప్రదర్శనలు ఉంటాయన్నారు. కమిటీ సమావేశంలో డీసీపీవో అరుణ్ కుమార్ త్రిపాఠి, నృసింహ చరణ్ పటా్నయక్, మనోజ్ పాఢి, శుభ్రాంశు పట్నాయక్, నాగేశ్వర మహాపాత్రో, శిశిరో గాడో, బాలక్రిష్ణ పాణిగ్రాహి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు



స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పాటు అమీర్ బుయోను చూపుతున్న పోలీసులు

కాశీబుగ్గ: సొంత గ్రామంలోనే మెకానిక్ షెడ్ పెట్టుకొని జీవనం సాగిస్తూ ఒక్కసారిగా ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో ఒక వ్యక్తి అరెస్టైన ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా రాయఘడ బ్లాక్ ముండలసాయి గ్రామానికి చెందిన అమీర్ బుయో అనే యువకుడు మెకానిక్ పని నేర్చుకుని తన స్వగ్రామంలో ఇంటి వద్ద మెకానిక్ షెడ్ నిర్మించుకుని ఉపాధి పొందుతున్నాడు. అయితే తనకు ఈజీగా డబ్బు సంపాదించాలనే అత్యాశ కలగడంతో మెకానిక్ నైపుణ్యాన్ని దొంగతనాలకు ఉపయోగించాడు. స్నేహితులతో కలిసి రాత్రి సమయాల్లో లాక్ చేసిన ఖరీదైన ద్విచక్ర వాహనాలను దొంగలించడం ప్రారంభించారు. కాశీబుగ్గ పోలీసు డివిజన్ పరిధిలో ఉన్నటువంటి ఇచ్ఛాపురం, సోంపేట, మందస, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, టెక్కలి ప్రాంతాల్లో దొంగతనాలు చేసి, వాహనాలను తన ఇంట్లో ఉన్న సీక్రెట్ గ్యారేజీలో పార్టులు మార్చి ఆదాయం సంపాదించుకునేవాడు.

నంబర్ ప్లేట్లు మార్చి అమ్మకాలు

అనంతరం ఎక్కువ డబ్బులు వస్తాయని ఆలోచించి దొంగలించిన బైకులకు నంబర్ ప్లేట్లను మార్చి అమ్మకాలు చేపట్టాడు. ఈ క్రమంలో బైక్ అమ్ముతుండగా కాశీబుగ్గ పోలీసులకు మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు మొగిలిపాడు వద్ద పట్టుబడి జైలు పాలయ్యారు. ఈ సందర్భంగా కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం పర్లాఖిమిడి పోలీసుస్టేషన్ పరిధిలో రఘునాథ్ పాత్రో అనే వ్యక్తి ఇటీవల అరెస్టయ్యాడని తెలిపారు. అతడు ఇచ్చిన సమాచారం మేరకు అక్కడి పోలీసులు అలెర్టు చేయడంతో కాశీబుగ్గ సీఐ మోహనరావు, ఎస్‌ఐలు గవరయ్య, షణ్ముఖరావు, ప్రసాద్, నీలకంఠంలు మాటువేసి అమీర్‌ను పట్టుకున్నారని వెల్లడించారు. అనంతరం అతడి వద్ద నుంచి పదిహేను ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో ఆరు బుల్లెట్లు, 9 పల్సర్ బైకులు ఉన్నాయి. అమీర్ బుయో, రఘునాథ్ పాత్రోతో పాటు ఇంకా పెద్ద ముఠా ఉందని వారిని పట్టుకుంటామన్నారు.

రాష్ట్రంలో బంగాళాదుంపల సంక్షోభం

- ప్రభుత్వంపై ధ్వజమెత్తిన ప్రతిపక్ష బీజేడీ, కాంగ్రెస్ సభ్యులు

భువనేశ్వర్: రాష్ట్రంలో బంగాళా దుంపల సంక్షోభంపై అధికార భారతీయ జనతా పార్టీపై ప్రతిపక్ష బిజూ జనతా దళ్, కాంగ్రెస్ సభ్యులు ధ్వజమెత్తారు. ఈ సంక్షోభం నుంచి బయట పడేందుకు వేగంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కృత్రిమ కొరతతో పెరుగుతున్న ధరల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. సోమవారం ప్రతిపక్ష బిజూ జనతా దళ్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాష్ట్రంలోని బంగాళా దుంప సంక్షోభం అంశాన్ని లేవనెత్తడం ద్వారా అధికార బీజేపీ ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేయడానికి ప్రయత్నించారు. ఈ అంశాన్ని లేవనెత్తిన విపక్ష బీజేడీ చీఫ్ విప్ ప్రమీలా మల్లిక్, బంగాళాదుంపల ధరలను అదుపులోకి తీసుకురావడానికి ప్రభుత్వం ఏమీ చేయలేక పోతోందని విమర్శించారు. బీజేడీ ఎమ్మెల్యేలు సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రదర్శన నిర్వహించారు. కాంగ్రెస్ శాసన సభ (సీఎల్పీ) నాయకుడు రామచంద్ర కదమ్ కూడా ఈ అంశంపై ప్రభుత్వంపై మండిపడ్డారు. ఉత్తర ప్రదేశ్ నుంచి రప్పించిన 300 ట్రక్కుల బంగాళాదుంపలు ఎంతకాలం అవసరాలు గట్టెక్కిస్తాయని ప్రతిపక్ష సభ్యులు సభలో గందరగోళం సృష్టించారు. ప్రభుత్వం రెండు రోజుల్లో బంగాళాదుంపల సంక్షోభాన్ని పరిష్కరించడానికి కఠినమైన చర్యలు తీసుకోవాలని ఒత్తిడి చేశారు. బిజూ జనతా దళ్ ఎమ్మెల్యే బ్యోమకేష్ రే మాట్లాడుతూ, ఇలాంటి బంగాళాదుంప సంక్షోభం మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ హయాంలో కూడా తలెత్తిందని, దీన్ని బిజూ జనతా దళ్ ప్రభుత్వం సమర్థంగా నిర్వహించిందని గుర్తు చేశారు. పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్ నుంచి దిగుమతి చేసుకోవడం ద్వారా సమస్యను పరిష్కరించడానికి విభాగం మంత్రి మరియు రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం ప్రయత్నం చేయడం లేదన్నారు. రాష్ట్రంలో ప్రజలకు ప్రతి రోజూ 300 ట్రక్కుల బంగాళాదుంపలు అవసరమని బ్యోమకేశ రే తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలుగడ్డ సంక్షోభాన్ని పరిష్కరించకుంటే ప్రజలు వీధిన పడాల్సి వస్తుందన్నారు. బీజేపీ ఎమ్మెల్యే సరోజ్ పాఢి మాట్లాడుతూ.. సంక్షోభాన్ని బీజేపీ ప్రభుత్వం నిర్వహించలేకపోతోందన్న వాదన సరికాదన్నారు. గత 24 ఏళ్లలో గత ప్రభుత్వం బంగాళా దుంప ఉత్పత్తిని పెంచడానికి ఎప్పుడూ ప్రయత్నించలేదన్నారు. బంగాళా దుంపల మిషన్, కోల్డ్ స్టోరేజీ వంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టనందున బంగాళా దుంపల సంక్షోభం నిరవధికంగా వేధిస్తోందని అన్నారు. పశ్చిమ బెంగాల్ బంగాళా దుంపలు సరఫరాకు అంగీకరించకుంటే ప్రభుత్వం ఉత్తర ప్రదేశ్, పంజాబ్‌తో సహా ఇతర రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి బంగాళా దుంపల సంక్షోభం తొలగిస్తామని అధికార పక్షం ఎమ్మెల్యే సరోజ్ పాఢి తెలిపారు.

ఎకో రిట్రీట్ సెంటర్ ప్రారంభం



పుట్‌సీల్‌లో ప్రారంభమైన ఎకో రిట్రీట్ సెంటర్



ఎకో రిట్రీట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ కీర్తివాసన్

కొరాపుట్: కొరాపుట్ జిల్లా సిమిలిగుడ సమితిలో పుట్‌సీల్ పర్వత ప్రాంతంలో ఎకో రిట్రీట్ సెంటర్‌ను సోమవారం కలెక్టర్ వి.కీర్తి వాసన్ ప్రారంభించారు. పుట్‌సీల్ గ్రామంలో పర్యాటకుల కోసం ఒడిశా టూరిజం శాఖ తరపున అంతర్జాతీయ ప్రమాణాలతో 32 వసతి కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేక స్టాళ్లు, వైద్య కేంద్రాలు ఏర్పాటు చేశారు. త్వరలో భారత మాల రోడ్డు నిర్మాణం పూర్తవుతుందని, తద్వారా విశాఖపట్నం నుంచి పర్యాటకులు రెండు గంటల సమయంలో ఇక్కడికి చేరుకోవచ్చన్నారు. అదే విధంగా దేవమాలి పర్వతానికి వెళ్లే రోడ్డు మార్గం అభివృద్ధి చేస్తామన్నారు. పుంజసీల్, గుప్తేశ్వరం, దుదారి, మాలి మా మందిరం, తదితర పర్యటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని కలెక్టర్ ప్రకటించారు.

87 ఎకరాల్లో గంజాయి ధ్వంసం



రాయిపంక పంచాయతీలో గంజాయి క్షేత్రాన్ని తగులబెడుతున్న పోలీసు సిబ్బంది



గరడమా ఏజెన్సీలో గంజాయి పంటను ధ్వంసం చేస్తున్న అటవీ, పోలీసు సిబ్బంది

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి పంట ఆపరేషన్ క్లీన్ గ్రీన్‌లో భాగంలో సోమవారం మోహనా బ్లాక్ అడవ పీఎస్ పరిధిలో రాయిపంక ప్రాంతం గరడమా, శికులిమయా, గుంజిపదర్ వంటి మూడు గ్రామాల్లో పోలీసు, ఎక్సైజు, ఫారెస్టు అధికారులు జరిపిన దాడుల్లో 87 ఎకరాల్లో పండిస్తున్న 1,74,000 గంజాయి మొక్కలను యంత్రాలతో నాశనం చేసి తగులబెట్టారు. ఈ సందర్భంగా అడవ పోలీసు స్టేషన్‌లో ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో 200 మంది పోలీసు, ఎక్సైజు, ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు. ధ్వంసం చేసిన గంజాయి మొక్కలు విలువ సుమారు మార్కెట్‌లో రూ.17 కోట్లు ఉంటుందని ఎస్పీ జితేంద్రనాథ్ పండా తెలిపారు. ఈ దాడులు డిసెంబరు నెలాఖరు వరకూ కొనసాగుతాయని జిల్లా ఎస్పీ తెలిపారు.

27 ఎకరాల్లో గంజాయి క్షేత్రం ధ్వంసం

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా బ్లాక్ అడవ పీఎస్ మండిమర పంచాయతీలో కలెపంక ఏజెన్సీలో 27 ఎకరాల్లో అక్రమంగా పండిస్తున్న గంజాయి పంటను సోమవారం సాయంత్రం ధ్వంసం చేసినట్టు మోహన పోలీసు ఐఐసీ బసంత్ కుమార్ సెఠి తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆపరేషన్ క్లీన్ గ్రీన్‌లో భాగంలో మండిమర పంచాయతీలో 54వేల గంజాయి మొక్కలను యంత్రాలతో నాశనం చేసి తగులబెట్టినట్టు మోహన ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జి సెఠి తెలిపారు. వీటి విలువ మార్కెట్‌లో రూ.5 కోట్లు ఉంటుందని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమి పూజలు



శివపార్వతులకు పూజలు చేసిన దృశ్యం



తులసిమొక్క వద్ద దీపారాధన

జయపురం: జయపురంలోని తెలుగు వారి లోగిళ్లలో పోలిపాడ్యమి పూజలను భక్తి శ్రద్ధలతో సోమవారం చేశారు. శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక మాసం ఆదివారంతో ముగిసింది. సోమవారం మార్గశిర మాసం ప్రారంభం కావడంతో పాడ్యమి పూజలను చేశారు. మహిళలు పుణ్యస్నానాలు చేసి.. తులసి మొక్కల వద్ద దీపాలు వెలిగించి శివపార్వతులకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పెద్దలు పాడ్యమి కథను చదివి కుటుంబ సభ్యులకు వినిపించారు.

క్లుప్తంగా

గంజాయి వ్యాపారుల ఆస్తులను జప్తుచేస్తాం



● విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి

విజయనగరం క్రైమ్: విశాఖ రేంజ్ పరిధిలో గంజాయి వ్యాపారుల ఆస్తులను గుర్తించి జప్తు చేస్తామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి అన్నారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలతో సోమవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. గంజాయి వ్యాపారుల ఆస్తుల గుర్తింపులో సాధించిన పురోగతిపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆదేశాలతో గంజాయి నిందితుల ఆస్తులను గుర్తించడంపై దిశానిర్దేశం చేశారు.

శతశాతం ఉత్తీర్ణతకు 'సంకల్పం'



నెల్లిమర్ల జూనియర్ కళాశాలలో సాగుతున్న 'సంకల్ప్-25' తరగతులు

విజయనగరం అర్బన్: ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఇంటర్మీడియట్ విద్యాశాఖ 'సంకల్ప్-25' పేరుతో వినూత్న కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించింది. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కళాశాల ప్రాంగణంలో స్టడీ అవర్ నిర్వహిస్తారు. అక్టోబర్‌లో నిర్వహించిన త్రైమాసిక పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను మూడు గ్రూపులుగా విభజించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులు ఐదారుగురిని ఒక్కో అధ్యాపకుడు దత్తత తీసుకుంటారు. వీరందరూ చదువులో ప్రగతి చూపించేలా చూడాల్సిన బాధ్యత ఆ అధ్యాపకుడిపై ఉంటుంది. అన్ని కళాశాలలకు సమాధానాలతో రూపొందించిన క్వశ్చన్ బ్యాంక్ ఇస్తారు. రోజువారీ అధ్యయనంలో భాగంగా విద్యార్థులందరూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్వశ్చన్ బ్యాంక్ చదివి ప్రశ్నలకు జవాబులు రాయాల్సి ఉంటుంది. గతంలో ఉదయం 9.30 నుంచి 4.30 గంటల వరకు తరగతులు నిర్వహించేవారు. ప్రస్తుతం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నారు. సంకల్ప్ కార్యక్రమం ఫిబ్రవరి 5వ తేదీ వరకు కొనసాగుతుందని ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి మజ్జి ఆదినారాయణ తెలిపారు. విద్యార్థులందరూ అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణుల య్యేలా టైమ్‌టేబుల్ రూపొందించి తర్ఫీదు ఇస్తామన్నారు. వారానికి మూడు రోజులపాటు స్టడీ అవర్స్‌ను డీవీఈఓ, ఆర్ఐఓ సందర్శిస్తారన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

భోగాపురం: తెగిపడిన విద్యుత్ తీగ కాలికి తగిలి షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. సోమవారం ఉదయం భోగాపురం మండలంలోని పోలిపల్లి గ్రామంలో జరిగిన ఈ సంఘటనపై మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోలిపల్లి గ్రామానికి చెందిన కోనాడ ఎల్లాజీ(32) వేకువజామునే లేచి తన ఇంట్లో పూజలు చేసిన పువ్వులను గంగలో కలిపేందుకు గ్రామానికి సమీపంలో కొత్తచెరువు వద్దకు వెళ్లాడు. అక్కడ విద్యుత్ స్తంభం కండక్టర్ నుంచి తెగిపడి ఉన్న విద్యుత్ తీగలను గమనించకపోవడంతో అవి కాలికి తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి తల్లిదండ్రులు ఎల్లయ్యమ్మ, దావనంతో పాటు తమ్ముడు ధనరాజ్ ఉన్నారు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తవుడు తెలిపారు.

సారాతో ఇద్దరి అరెస్ట్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ద్విచక్రవాహనంపై సారా తరలిస్తున్న ఇద్దరు నిందితులు కురుపాం మండలంలోని మూలిగూడ జంక్షన్ వద్ద సోమవారం పట్టుబడినట్లు ఎస్సై పి.నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆరు ట్యూబ్‌లలో నింపి ఉన్న సుమారు 240 లీటర్ల సారా, ఒక ద్విచక్ర వాహనాన్ని నిందితుల నుంచి స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

5 కిలోల గంజాయి పట్టివేత

సాలూరు: పాచిపెంట మండలంలో పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద ఓ వ్యక్తి నుంచి సోమవారం ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ వెంకటసురేష్ తెలిపారు. ఒడిశా రాష్ట్రం కొరాపుట్‌కు చెందిన చిన్మయ మహారాణా అనే వ్యక్తి ఒడిశా నుంచి విశాఖపట్నానికి గంజాయిని తీసుకెళ్తుండగా పట్టుకున్నామన్నారు. ముద్దాయిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు తెలిపారు.

స్పందించిన యంత్రాంగం

విజయనగరం ఫోర్ట్: తుఫాన్ కారణంగా పంట తడిచిపోవడం, ధాన్యం కొనుగోలు చేయక కళ్లాల్లో ధాన్యం రాసులు ఉండి పోవడం కారణంగా రైతులు ఇబ్బంది పడుతున్న అంశంపై సోమవారం 'అన్నదాతకు కష్టం' అనే శీర్షికను 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి వ్యవసాయ అధికారులు స్పందించారు. రైతుసేవా కేంద్రాల్లో పనిచేసే గ్రామ వ్యవసాయ సహాయకులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. గంట్యాడ మండలం పెదవేమలి గ్రామంలో రైతు కళ్లంలో ఉన్న ధాన్యంను గ్రామ వ్యవసాయ సహాయకురాలు ప్రమీల పరిశీలించి వర్షం తగ్గిన వెంటనే మిల్లుకు తరలించే ఏర్పాటు చేస్తామని తెలిపారు. విజయనగరం మండలం పినవేమలి గ్రామంలో పనలపై గ్రామ వ్యవసాయ సహాయకుడు రమేష్ దగ్గరుండి ఉప్పుద్రావణం పిచికారీ చేయించారు.

ప్రభుత్వ భరోసా శూన్యం..
దళారులకే ధాన్యం



కొండంపేట వద్ద వరిచేను కుప్పలపై టార్పాలిన్‌లు కప్పిన రైతులు

- వరి రైతులను పీకల్లోతు కష్టాల్లో ముంచేసిన కూటమి ప్రభుత్వం
- పలుచోట్ల వరి పంటకు 'తుపాను' ప్రభావంతో నష్టం
- నూర్చేసిన ధాన్యం తడవకుండా కాపాడుకోవడానికి అష్టకష్టాలు
- ధాన్యం తడిసినా కొంటామన్న భరోసా కరువు
- విధిలేని పరిస్థితుల్లో దళారులు చెప్పిన ధరకే అమ్మకం
- ధర, తూకం తేడాతో తీవ్రంగా నష్టపోతున్న రైతులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

టీడీపీ కూటమి ప్రభుత్వ పాలనలో ఆరునెలల తిరగకముందే రైతులకు చుక్కలు కనబడుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో దూరదృష్టితో, మహోన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాలు రైతులకు తమ చెంతనే అందించిన సేవల విలువేమిటో ఇప్పుడు తలచుకొని బాధపడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు తడిచిపోతుంటే వారి కళ్లు చమర్చుతున్నాయి. భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం ముఖం చాటేస్తోంది. మొక్కుబడిగా అక్కడక్కడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిచినా అవేవీ ఇప్పుడు ఉపయోగపడట్లేదు. తడిచిన ధాన్యం మునుపటి ప్రభుత్వంలా కొంటామన్న భరోసా ఏదీ ఇవ్వట్లేదు. ఇక ఆలస్యం చేస్తే అన్నివిధాలా నష్టపోతామన్న భయంతో రైతులు తమ పంటను నష్టమైనా తక్కువ ధరకే దళారులకే విక్రయించేస్తున్నారు. ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని టీడీపీ కూటమి నాయకులు చేస్తున్న ప్రకటనలు ఆచరణలోకి రావట్లేదు.

విజయనగరం జిల్లాలో సుమారు 1.74 లక్షల మంది రైతులు ఈ ఖరీఫ్‌లో వరి సాగు చేశారు. దాదాపు 4.46 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. 510 రైతుసేవా కేంద్రా (ఆర్ఎస్‌కే)ల పరిధిలో 244 క్లస్టరుగా విభజించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఇప్పటివరకూ తూతూ మంత్రంగానే వాటిని పెట్టారు.

● రైతన్న నిలువునా దగా...



బొబ్బిలి మండలం రంగరాయపురంలో ధాన్యం బస్తాలపై టార్పాలిన్లు కప్పుతున్న రైతు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం రైతు భరోసా పథకం ద్వారా ఇచ్చిన పెట్టుబడి సాయం రైతులకు ఎంతగానే ఉపయోగపడింది. దుక్కి పనులతో పాటు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోలుకు అక్కరకు వచ్చేది. అంతేకాదు దళారుల బారినపడకుండా ఆర్‌బీకేల ద్వారానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసేది. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ఇవ్వడంతో రైతులకు కాస్త గిట్టుబాటు అయ్యేది. టీడీపీ కూటమి నాయకులు గత ఎన్నికల సమయంలో అరచేతిలో వైకుంఠం చూపించారు. అధికారంలోకి రాగానే ప్రతి రైతుకు రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని ఆశలు రేపారు. కానీ ఇంతవరకూ పైసా కూడా ఖాతాలో వేయలేదు. దీంతో చాలామంది రైతులు మళ్లీ పూర్వంలాగే ధాన్యం వ్యాపారుల (దళారులు) వద్ద చేబదులు తీసుకొని పెట్టుబడులు పెట్టారు. మరి కొంతమంది ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద రూ.3 నుంచి రూ.5 వడ్డీకి అప్పులు తెచ్చుకోవాల్సి వచ్చింది. తీరా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఆలస్యంగా అదీ అక్కడక్కడా తెరిచింది. అక్కడ సవాలక్ష ఇబ్బందులు పెడుతుండడంతో వేరే గత్యంతరం లేక దళారులకే, వారు చెప్పిన ధరకే రైతులు ధాన్యం విక్రయించేస్తున్నారు. ఇప్పటికే దాదాపు లక్ష మెట్రిక్ టన్నుల వరకూ దళారులే కొనుగోలు చేసి, ఇతర జిల్లాలకు తరలించినట్టు సమాచారం. ఒక్క బొబ్బిలి ఏఎంసీ పరిధిలో ఉన్న బొబ్బిలి, రామభద్రపురం, పెరుమాళి తదితర చెక్‌పోస్టుల వద్ద రూ.2 సెస్సు ప్రకారం రూ.30.02 లక్షలను వసూలు చేశారంటే ధాన్యం రూ.30 కోట్లకుపైగా తరలిపోయినట్టులెక్క. ఇక జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏఎంసీల పరిధిలో మరెంత ధాన్యం తరలిపోయిందో అర్థమవుతోంది.

● అంతా అయోమయం...

రైస్ మిల్లర్ల ప్రమేయాన్ని నియంత్రించే వ్యవస్థకు టీడీపీ కూటమి ప్రభుత్వం గండికొట్టేసింది. రైతులకు మేలు చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలుచేసిన 'రైస్‌మిల్లుల ర్యాండమైజేషన్' విధానాన్ని ఎత్తేస్తున్నట్లు ప్రకటించింది. రైతుకు నచ్చిన మిల్లుకు ధాన్యం తీసుకెళ్లవచ్చంటూ గొప్పలు చెప్పింది. కానీ ఈ నిర్ణయమే మళ్లీ దళారుల నెట్టిన పాలుపోసినట్టయింది. మరోవైపు పంటకోత తర్వాత నూర్చిన ధాన్యాన్ని ఆరబెట్టుకుందామంటే కనీస సౌకర్యాల్లేక రైతులకు దిక్కుతోచడం లేదు. ధాన్యం పట్టడానికి 60 లక్షల వరకూ గోనె సంచులు అవసరమవుతాయి. వాటిలో రైస్ మిల్లర్లు 50 లక్షల వరకూ ఇస్తామని ప్రకటించారే తప్ప వారు ఇచ్చినవి 25 లక్షలకు మించలేదని తెలిసింది. వ్యవసాయ పరపతి సంఘాల (పీఏసీఎస్) ద్వారా పౌరసరఫరాల సంస్థ అధికారులు దాదాపు 8 లక్షల గోనె సంచులు ఇవ్వాలి కానీ ఇంతవరకు 4 లక్షలు మాత్రమే సిద్ధం చేశారు.

● గెద్దల్లా వాలిపోతున్న దళారులు...

ఒకవైపు ముంచుకొచ్చిన ముసురు, మరోవైపు ప్రభుత్వం నుంచి కనీసం భరోసా దక్కకపోవడంతో నైరాశ్యంలోనున్న రైతులను దోచుకునేందుకు దళారులు గెద్దల్లా వాలిపోతున్నారు. తాము చెప్పిన ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. వాస్తవానికి సాధారణ రకానికి కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2300 చొప్పున రావాలి. కానీ దళారులు క్వింటాకు రూ.1770 మాత్రమే చెల్లిస్తున్నారు. ఇలా 50 క్వింటాళ్ల ధాన్యం విక్రయిస్తే రైతుకు రూ 26,400 వరకు నష్టం వాటిల్లుతోంది.

మొలకలు వచ్చేస్తాయి...



నారాయణపురం కుడికాలువ ఆయకట్టుతో పాటు సాయన్నగెడ్డ ఆయకట్టులో ముంపు వచ్చేసింది. వరి పంట పూర్తిగా పొలాల్లోనే ఉండిపోయింది. ఈ వర్షాలతో నీరు చేరడంతో మా ప్రాంతంలో 4 వేల ఎకరాల్లో నష్టం ఉంటుంది. ధాన్యానికి మొలకలు వచ్చేస్తాయి. అధికారులు పరిశీలించి నష్టపరిహారం వచ్చేలా ప్రభుత్వానికి సిఫారసు చేయాలి.

– మొయ్యి మోహనరావు, మాజీ సర్పంచ్, చిత్తారిపురం, సంతకవిటి మండలం

ప్రభుత్వానికి ముందుచూపు లేదు....



ఆరుగాలం కష్టించిన రైతు పంట చేతికొచ్చే సమయంలో నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది. ప్రభుత్వానికి ముందుచూపు లేదు. డిసెంబర్ వచ్చేసినా కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి రాలేదు. దళారులకు అమ్మితే ఎకరాకు రూ.20వేల నుంచి 23వేల వరకు నష్టం వస్తోంది.

– కన్నా ప్రసాదరావు, రైతు, రుద్రిపేట, పాలకొండ మండలం

నాగావళి మురిసినది



సందడిగా ఉన్న నాగావళి నదీతీరం

- తోటపల్లి కిటకిట
- భక్తుల రాకతో పులకించిన నాగావళి
- నదిలో తెప్పలు విడిచిపెట్టిన మహిళలు

గరుగుబిల్లి:

'పోలిపాడ్యమి' సందర్భంగా తోటపల్లిలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం భక్తుల 'ఓం నమః శివాయ..హరహర మహదేవ శంభో శంకర' 'ఏడు కొండలవాడ వేంకటరమణ...గోవిందా....గోవిందా' అంటూ చేసిన దైవ నామస్మరణతో హోరెత్తింది. ఆలయ అర్చకుడు అప్పలాచార్యులు నాగావళి నదికి పుణ్య హారతులిచ్చి పోలిపాడ్యమి పూజలను ప్రారంభించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి భక్తులు సమీపంలోని నాగావళినది తీరానికి చేరుకున్నారు. కార్తీకమాసంలో నెలరోజులనుంచి చేసిన పూజలకు నదీతీరంలో వీడ్కోలు చెబుతూ మార్గశిర శుద్ధ పాడ్యమినాడు మహాలక్ష్మిని ఆహ్వానిస్తూ తెప్పలపై దీపాలనుపెట్టి నదిలో విడిచిపెట్టారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. పార్వతీపురం, గరుగుబిల్లి, కొమరాడ, కురుపాం, జియ్యమ్మవలస తదితర మండలాలతోపాటు రాజాం, వీరఘట్టం తదితర ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు మాట్లాడుతూ మార్గశిరశుద్ధ పాడ్యమినాడు జీవనదుల్లో స్నానంచేసి స్వామివారిని దర్శించుకుంటే, కోటి నదులలో స్నానం ఆచరిస్తే ఎంత ఫలితం వస్తుందో, పాడ్యమిరోజు నదులలో స్నానం చేయడంవల్ల అంత గొప్ప ఫలితం వస్తుందని పురాణాలలో పేర్కొన్నట్టు తెలిపారు. పూజలలో పాల్గొన్న భక్తులకు ఉచిత ప్రసాదాలను ఆలయ సిబ్బంది వితరణ చేశారు. స్థానిక ఎస్సై రమేష్‌నాయుడు పర్యవేక్షణలో భక్తులను క్యూలో ఉంచి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారు. అలాగే ఆలయ సిబ్బంది, టీటీడీ అభివృద్ధి కమిటీ సభ్యులు అవసరమైన సేవలను అందించారు.

దీపాలతో ప్రత్యేక పూజలు

పోలిపాడ్యమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహిళలు వెలిగించిన దీపాలు ప్రత్యేక అలంకరణగా నిలిచాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచి పూజలు ప్రారంభించడంతో ఆలయ ప్రాంగణమంతా దేదీప్యమానంగా కాంతులతో నిండింది. ఈ సందర్భంగా సంప్రదాయ నృత్యాలు, రామ భజనలు భక్తులను ఆకర్షించాయి. ఆలయంనుంచి నాగావళి నదీ తీరం వరకు ఏర్పాటుచేసిన విద్యుత్ దీపాలు చాలా ఆకర్షణగా నిలిచాయి.



ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కుంకీ ఏనుగులు ఎక్కడ..?



కుమ్మరిగుంటలో ధ్వంసం చేసిన టమాటో పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు వేణు, ఇందిర, సాంబమూర్తి తదితరులు

● సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

కొమరాడ: ఒడిశా నుంచి 2018లో వచ్చిన ఏనుగుల గుంపు కురుపాం నియోజకవర్గం కొమరాడ మండలంలో తిష్ఠ వేసి ప్రాణ, ఆస్తినష్టం కలిగిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కుంకీ ఏనుగులను తీసుకుని వచ్చి గజరాజులను తరలిస్తామన్న పాలకుల మాటలు ఎక్కడ అని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం మండలంలోని కుమ్మరిగుంట, కందివలస, స్వామినాయుడువలస తదితర గ్రామాల్లో పంటలు ధ్వంసం చేసిన పొలాల్లో సీపీఎం నాయకుల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు కొల్లు సాంబమూర్తి మాట్లాడుతూ ఈ ప్రాంతానికి వచ్చిన గజరాజుల గుంపు 13 మందిని పొట్టన పెట్టుకుని వేలాది ఎకరాల్లోని పంట ధ్వంసం చేసినా ప్రభుత్వానికి కనీసం చీమ కుట్టినట్లయినా లేదన్నారు. ఆరుగాలం కష్టపడి టమాటో పంటకు ఎకరాకి వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట చేతికి వచ్చిన సమయంలో ఇలా ఏనుగులు ధ్వంసం చేయడంతో రైతులు ఏం చేయాలంటూ మండిపడ్డారు. ఓట్ల కోసం పాలకులు మాటలు చెప్పి గెలిచిన తరువాత కనీసం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తక్షణం ఏనుగుల గుంపును తరలించాలని లేదంటే రైతులతో పాటు పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకురాలు ఇందిర, పలువురు రైతులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లో సత్తాచాటారు. ఏలూరు జిల్లా పెద్దవేగిలో జరిగిన స్టేట్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో సీనియర్ చెస్ విభాగంలో పి.అభిషేక్ రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించాడు. జూనియర్స్ కేరమ్స్ పోటీల్లో పదోతరగతి విద్యార్థులు కె.అనిల్, జి.తరుణ్‌లు రాష్ట్రస్థాయిలో తృతీయ బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం వారిని కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, పీడీ రామకృష్ణ, పీఈటీ జె.చిరంజీవిలు అభినందించారు.



రేగిడి : రాష్ట్రస్థాయిలో గెలుపొందిన విద్యార్థులు

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

● కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్, తదితరులు

విజయనగరం ఫోర్ట్: క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. విజయనగరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఈ నెల7 నుంచి ప్రారంభం కానున్న క్షయవ్యాధి నిర్మూలన ప్రచార కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రచార కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు, సీహెచ్ఓలు, ఎంఎల్‌హెచ్ఓలు, ఏఎన్ఎంలు, పీహెచ్‌సీ వైద్యులు, మహిళా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొంటారన్నారు. ప్రతీ వారం ర్యాలీలు నిర్వహించి క్షయవ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కళాశాలల సమీపంలో సిగరెట్ల విక్రయాలను నిర్మూలించాలన్నారు. ఎమ్మెల్సీ సురేష్‌బాబు మాట్లాడుతూ వ్యాధిసోకిన తర్వాత నిర్మూలించడం కంటే సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘురాజు, టీబీ స్టేట్ జాయింట్ డైరెక్టర్ రమేష్, ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ కె.రాణి, వైద్యులు మహేష్, ప్రియదర్శిని, తదితరులు పాల్గొన్నారు.

● పత్తి పంటకు ఫెంగల్ ఎఫెక్ట్



ఫెంగల్ తుఫాన్ వర్షాలు పత్తి పంటకు నష్టం కలిగించాయి. పత్తి కాయలు విచ్చుకునే సమయంలో కురిసిన వర్షాలతో పంట తడిసిముద్దయింది. పత్తికాయలు కాస్తా నల్లబడ్డాయి. తేమ శాతం ఎక్కువ కావడంతో తడిసిన పత్తిని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడంలేదు. స్థానికంగా కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ఏడాది నష్టపోయామంటూ రాజాం, సంతకవిటి మండలాలకు చెందిన రైతులు వాపోతున్నారు. – రాజాం



గడిముడిదాం సమీపంలో తడిచిన పత్తి పంట, (ఇన్‌సెట్లో) తుఫాన్ వర్షాలకు నలుపురంగులోకి మారిపోతున్న పత్తికాయ

సైబర్ క్రైమ్ కేసులో ఐదుగురి అరెస్ట్

● రూ.10 లక్షల నగదు, రూ.9.20 లక్షల బంగారు ఆభరణాలు, 6 సెల్‌ఫోన్‌లు రికవరీ



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: సైబర్ క్రైమ్ కేసును ఛేదించి ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, వారినుంచి రూ.10 లక్షల నగదు, రూ.9.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నిందితులు వినియోగిస్తున్న ఆరు సెల్‌ఫోన్‌లను రికవరీ చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. విజయనగరం పట్టణానికి చెందిన రిటైర్డ్ లెక్చరర్ ఉసిరికల సుజాత కుమారికి అక్టోబర్ 10న ఉదయం 10.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశారు. తాము పోలీసులమని, మీరు పంపించిన పార్సిల్‌లో డ్రగ్స్ ఉన్నట్టు కనుగొన్నామని డిజిటల్ అరెస్టు చేస్తున్నామని, డీసీపీ స్థాయి అధికారి కేసు విచారణ చేస్తున్నారని, మీ బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న డబ్బులను వెంటనే తాము సూచించిన బ్యాంక్ అకౌంట్‌కు పంపించాలని, బ్యాంక్ లావాదేవీలను వెరిఫై చేసిన తర్వాత, తిరిగి మొత్తాన్ని మీ బ్యాంక్ అకౌంటుకు పంపిస్తామని బెదిరించారు. దీంతో నిందితులు సూచించిన బ్యాంక్ ఖాతాకు ఆమె రూ. 40 లక్షల 11వేలు పంపించారు. అప్పటి నుంచి నిందితుల మొబైల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసినట్లు బాధితురాలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు సైబర్‌క్రైమ్ పోర్టల్‌లో సకాలంలో ఫిర్యాదు చేయడంతో నిందితుల ఖాతాలో రూ. 20 లక్షలు ఫ్రీజ్ అయ్యాయి.

అనంతరం ఎస్పీ ఆదేశాలతో కేసు దర్యాప్తు చేపట్టిన వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బాధితురాలి ఖాతా నుంచి నిందితుల ఖాతాకు జమ అయిన నగదు ప్రకారం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితులను ట్రేస్ చేశారు. ఈ కేసులో జమ్ముకశ్మీర్‌కు చెందిన మమిన్ తారిఖ్ భట్ (ఎ1), అనే నిందితుడిని అరెస్టు చేసి విచారణ చేశారు. అతని బ్యాంక్ ఖాతాను కొందరు సైబర్ నేరగాళ్లకు అద్దెకిచ్చినట్లు, తన అకౌంట్‌లో పడిన డబ్బులను ఐదు నిమిషాల వ్యవధిలోనే విత్‌డ్రా చేయడం, లేదా వేర్వేరు బ్యాంక్ ఖాతాలకు ట్రాన్స్‌ఫర్ చేయడం చేస్తుంటానని, అందుకు తనకు మూడుశాతం కమీషన్ ఇస్తారని తారిక్‌భట్ విచారణలో పేర్కొన్నాడు.

మహారాష్ట్రలో నలుగురి అరెస్ట్

ఎ1 నిందితుడు ఇచ్చిన సమాచారంతో వన్‌టౌన్ సీఐ, టీమ్ మహారాష్ట్ర వెళ్లి డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ మోసాలకు పాల్పడుతున్న ముఠాను గుర్తించారు. ఈ ముఠా టెలిగ్రామ్ యాప్ ద్వారా గ్రూప్‌గా ఏర్పడి, దేశ వ్యాప్తంగా ఇదే తరహాలో డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలకు పాల్పడుతూ, పెద్ద మొత్తంలో డబ్బులను దోచుకుంటున్నట్లు గుర్తించారు. అనంతరం ఖసిద్ధి చంద్రకాంత్ సుతార్ (ఎ2), క్లైవిన్‌గ్లెన్ బ్రిట్టో (ఎ3), నితిన్ నందలాల్ సరోజ్ (ఎ4), సైఫ్ తలమీ దమంద్ (ఎ5)లను మహారాష్ట్రలోని ముంబై, పూణేల్లో అరెస్టు చేసి నిందితుల దగ్గర నుంచి రూ. 10 లక్షల నగదు, రూ. 9.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, ఆరు మొబైల్ ఫోన్‌లను సీజ్ చేశారు. నిందితులందరి బ్యాంక్ ఖాతాలను సైబర్ నిందితులు వినియోగించుకుంటూ, కమీషన్‌గా వారికి కొంత నగదు చెల్లిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. కమీషన్ తీసుకునేందుకు అంగీకరించిన వారిని సైబర్ మోసగాళ్లు లాడ్జీల్లో బస చేయించి, వారి ఆధార్ కార్డ్, బ్యాంక్ చెక్‌బుక్‌లు, పాన్‌కార్డ్, బ్యాంక్ బుక్‌లను ముందుగా తీసుకుని, వారి వద్ద సెక్యూరిటీగా ఉంచుకుని, మోసాలకు పాల్పతున్నట్లు ఎస్పీ వివరించారు.



వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిందితులతో వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాసరావు

పరారీలో ముగ్గురు నిందితులు

ఈ కేసులో ప్రత్యక్ష సంబంధం ఉన్న మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని, వారిని అరెస్టు చేసేందుకు నిఘా పెట్టామని, గాలింపు చర్యలు చేపడుతు న్నామని ఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న నిందితులను త్వరలో అరెస్టు చేస్తామని ఎస్పీ తెలిపారు. కేసు ఛేదనలో సమర్థవంతంగా పనిచేసిన వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, ఎస్సై వీఎల్.ప్రసన్నకుమార్, కానిస్టేబుల్స్ వి.రవిశంకర్, ఎస్. రవికిశోర్, కె.సన్యాసినాయుడు, వై.రామరాజులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేశారు.